క్లుప్తంగా

అందుబాటులో బీపీటీ వడ్ల విత్తనాలు

చందంపేట : మండలంలోని తిమ్మాపురం సొసైటీ పరిధిలో బీపీటీ వడ్ల విత్తన బ్యాగులు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలంయాదవ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వడ్ల విత్తనాలను పరిశీలించి మాట్లాడారు. 25 కేజీల బీపీటీ వడ్ల విత్తన బ్యాగు రూ.1,137 అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు తిమ్మాపురం సొసైటీలో సంప్రదించాలని సూచించారు. త్వరలోనే యూరియా అందుబాటులోకి రానుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిర్యాలగూడ టౌన్ : హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో అక్రమంగా మద్యం అమ్ముతుండగా సమాచారం తనిఖీ చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఘటన పట్టణకేంద్రంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం .. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రవీంద్రనగర్ రైల్వే స్టేషన్ రోడ్డులో హోటల్, టిఫిన్ సెంటర్లల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసి బాణాల శ్రీనివాస్‌రెడ్డి హోటల్‌లో 33లీటర్ల వివిధ రకాల మద్యం బాటిళ్లు, 28 లీటర్ల వివిధ రకాల విస్కీ బాటిళ్లు స్వాధీనం చేసుకోని పంచానామా నిర్వహించి పోలీస్ స్టేషన్‌కు తరిలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి



సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

చందంపేట : ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాల వెంకటేశం అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా నేరెడుగొమ్ము మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన పీఆర్‌సీ, డీఏల విడుదల చేయించడానికి, పెండింగ్ బిల్లులు విడుదల కోసం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పల్లా మధుసూదన్‌రెడ్డి, జానకిరామయ్య, కట్టబోయినైదులు, పొట్ట రాములు, జానారెడ్డి, మధుసూదన్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీఆర్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : డంపింగ్ యార్డు సమీపంలో పాఠశాల, హాస్టళ్లలను నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతు న్న ఎస్‌పీఆర్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కోరుతూ సోమవారం బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ గంగాధర్, నరేష్, శైలేందర్, రమేష్, నవీన్, అజయ్ తదితరులున్నారు.

పని గంటల పెంపు జీఓను రద్దుచేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం పని సమయం పదిగంటలకు పెంచుతూ ఇచ్చిన జీఓను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక సంఘాల పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సంబంధిత జీఓ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 9న సమ్మెకు సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను మరింత రెచ్చగొట్టె విధంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్ల వెంకటయ్య, ఓడపల్లి యాదగిరి, బుడిగ వెంకటేష్, ముత్తమ్మ, రాణమ్మ, రాము, లక్ష్మయ్య ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

పెద్దవూర: షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన సోమవారం పెద్దవూర మండలంలోని ముసలమ్మచెట్టు స్టేజీ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవసాయ పనులకు వెళ్లాడు. అతడి భార్య తమ పిల్లలను పాఠశాలలో దింపిరావడానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో లోవోల్టేజీ సమస్యతో షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ తీగలకు మంటలు వ్యాపించి పొగలు కమ్ముకున్నాయి. గమనించిన పక్కంటి వాళ్లు వెంటనే వంట గదిలో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను బయటకు తెచ్చారు. ఇంటిలోని టీవీ, ఫ్రిడ్జ్, కూలర్, ఫ్యాన్‌లు, బియ్యం, వడ్లు, రూ. 30వేల నగదు, వంట సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.

నిత్యం విద్యుత్ కేబుల్ వైర్ల చోరీ

- వ్యవసాయ మోటార్ల కేబుళ్లను అపహరిస్తున్న దుండగులు
- రెండేళ్లలో ఐదుసార్లు చోరీ
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతులు

పెద్దవూర : మండలంలోని బట్టుగూడెం శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లను చోరీ చేశారు. గ్రామ సమీపంలోని పెద్దవాగు జలాల నుంచి తమ వ్యవసాయ పొలాలకు గ్రామానికి చెందిన పలువురు రైతులు కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసుకుని పంటలను సాగు చేస్తున్నారు. గ్రామ సమీపంలోని పెద్ద వాగుపై నిర్మించిన వంతెన వద్ద రైతులు ఇరవైకి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకుని వాగుకు విద్యుత్ మోటార్లు వేసుకుని స్టార్టర్ బాక్స్‌లను వాగు ఒడ్డుపై ఉంచి నీటిని పారించుకుంటున్నారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు స్టార్టర్ బాక్సుల నుంచి వాగులోని విద్యుత్ మోటార్ల వరకు వేసిన కాఫర్ కేబుల్ వైర్లను కట్ చేసి అపహరించారు. ఉదయం వ్యవసాయ మోటార్లను ఆన్ చేయటానికి రైతులు వెళ్లగా ఎంతకూ ఆన్‌కాకపోవడంతో అనుమానంతో చూడగా కేబుల్ వైర్లు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఒక్కటికాదు రెండు కాదు ఏకంగా ముప్పైకి పైగా మోటార్లకు చెందిన కేబుల్ వైర్లను అపహరించారు.



బట్టుగూడెంలో కేబుల్ వైర్లు కట్‌చేసిన స్టార్టర్ బాక్సు

ముప్పై మోటార్లకు పైగా ఒక్కో మోటారుకు ఏర్పాటు చేసిన కేబుల్ వైరు తక్కువలో తక్కువ 30 మీటర్లు ఉంటుంది. ఒక్క మీటర్ కాఫర్ కేబుల్ వైర్ రూ.150లు పెట్టి కొనుగోలు చేశామని రైతులు లబోదిబోమంటున్నారు. మొత్తం 1000 మీటర్ల కాఫర్ కేబుల్ వైరు అపహరణకు గురైందని రైతులు పేర్కొంటున్నారు. మళ్లీ కేబుల్ వైర్ కొనాలంటే రూ.5వేలకు పైగా ఖర్చు అవుతుందని వాపోతున్నారు. గత రెండేళ్లలో మండలంలోని పెద్దవూర, బట్టుగూడెం, పిన్నవూర, తెప్పలమడుగు, లింగంపల్లి తదితర గ్రామాల్లో పెద్దవాగుకు వేసిన విద్యుత్ మోటార్ల కాఫర్ కేబుల్ తీగలను అపహరించటం ఇది ఐదోసారి కావడం గమనార్హం. ప్రతిసారి కేబుల్ వైర్లను అపహరించటం, మరలా వ్యయప్రయాసల కోర్చి కొత్త కేబుల్ తీగలను కొనుగోలు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం రైతులకు పరిపాటిగా మారింది. గతంలో ఈ విషయమై రైతులు రెండుసార్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేబుల్ వైర్ల దొంగలను పట్టుకున్న పాపాన పోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేబుల్ వైర్లను అపహరిస్తుండటంతో బట్టుగూడెం గ్రామంలో తమ వ్యవసాయ మోటార్ల వద్ద రైతులు రూ.15వేలు ఖర్చు చేసి సీసీ కెమెరాను సైతం ఏర్పాటు చేశారు. అయినా సీసీ కెమెరాలో ఎక్కడా కనపడకుండా దొంగలు చాకచాక్యంగా కేబుల్ వైర్లను అపహరించుకుపోయారు.

ఐదుసార్లు అపహరించారు



గత రెండు సంవత్సరాలలో ఇప్పటికీ ఐదుసార్లు వ్యవసాయ విద్యుత్ మోటార్‌కు అమర్చిన కాపర్ కేబుల్ వైర్లను అపహరించారు. దొంగలు అపహరించిన ప్రతిసారి మరలా కేబుల్ వైర్‌కు, మెకానిక్‌కు, చార్జీలు అన్నీ కలిపి ఒక్కోరైతు రూ.5వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. పంట పొలాలకు సాగు నీరు అవసరం ఉన్న సమయంలోనే రాత్రికి రాత్రే పెద్దవాగు వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లను అపహరించుకుని పోతున్నారు. దీంతో రైతులం చాలా ఇబ్బందులు పడుతున్నా.. కేబుల్ వైర్ల దొంగలను పట్టుకుని శిక్షించాలి. – కత్తి ప్రభాకర్‌రెడ్డి, రైతు, బట్టుగూడెం

కలెక్టరేట్‌లో గిరిజనుల ధర్నా



పోలీసులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

నల్లగొండ : సమస్యపై విన్నవించేందుకు వస్తే కలెక్టర్ గన్‌మెన్లు అడ్డుకున్నారని ఆరోపిస్తూ గిరిజన సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో ధర్నా చేశారు. వివరాల ప్రకారం.. గుడిపల్లి మండలం కేశనేనిపల్లికి చెందిన జెటావత్ సుమన్ భార్య ఝాన్సీ గత నెల 6న కాన్పు కోసం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. ఆమె పరిస్థితి విషమించడంతో.. వైద్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఒక్క రోజు చికిత్స పొందాక ఆమె మృతిచెందింది. దీంతో ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో గత నెల 13న నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ధర్నా చేశారు. ఆ సందర్భంలో నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి ఆ కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.25 వేలతో పాటు ఆమె భర్తకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ విషయం అడగడానికి కలెక్టరేట్‌కు వస్తే తమపై దురుసుగా ప్రవర్తించారని గిరిజన సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. దీంతో నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి వారి వద్దకు వచ్చి ఝాన్సీ గాంధీ ఆస్పత్రిలో మృతిచెందినందుకు ఆ ఆసుపత్రి నుంచి డెత్ సర్టిఫికెట్ తీసుకు రావాలని సూచించాను. మీరు డెత్ సర్టిఫికెట్ తెస్తే రూ.25 వేలు ఇప్పించడంతో పాటు ఆమె భర్తకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని వారికి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి

మిర్యాలగూడ : పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ జూలకంటి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, వంటగదిని, క్రీడా మైదానాన్ని, తాగునీటిని, డ్రెయినేజీని పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబాట్టారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు మెరుగైన విద్యను అందించాలని, పాఠశాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ లావూరి బాలు, పాఠశాల ఎస్ఓ పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నా

మిర్యాలగూడ అర్బన్ : ట్రాఫిక్ పోలీసులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ లోకల్ ఆటో డ్రైవర్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో సాగర్ ప్రధాన రోడ్డుపై ప్రయాణికుల కోసం ఆపినా రోడ్డు ప్రక్కన నిలిపి ఉంచినా ట్రాఫిక్ పోలీసులు చలాన్లు రాసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆటోల ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్న తమకు ట్రాఫిక్ పోలీసుల చలాన్లు మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఆటోవాల ధర్నా విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని ఆటో డ్రైవర్లతో చర్చించారు. వారి ఇబ్బందులను తొలగిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

మూసీ కాల్వపై అక్రమ నిర్మాణం

మాడుగులపల్లి : మండలంలోని చిరుమర్తి గ్రామంలో గల సర్వే నంబనర్ 26లో మూసీ డిస్ట్రిబ్యూటర్ కాల్వ-25పై ఓ రైతు అక్రమంగా స్లాబ్ నిర్మించుకోని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ భూములకు వెళ్లడానికి అనువుగా ఉన్న కాల్వపై ఎత్తుగా స్లాబ్ నిర్మాణం చేపట్టడంతో సాగునీరు తమ వ్యవసాయ భూములకు చేరడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణాన్ని ఆపివేయాలని రైతులు అధికారులు విన్నవించుకున్నామని, అయినా సదరు రైతు వినిపించుకోకుండా కాల్వపై అక్రమంగా బ్రిడ్జి స్లాబ్ నిర్మించడంతో వర్షపు నీరు ఆ నిర్మాణం గుండా వెళ్లకపోవడంతో తమ పొలాలకు నీరందక ఎండిపోయే ప్రమాదం లేకపోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతు అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని తొలగించి సమీప రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.



మూసీ డిస్ట్రిబ్యూటరీ కాల్వపై అక్రమంగా నిర్మించిన స్లాబ్

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఉపాధిహామీ పథకంలో కొంత కాలంగా అక్రమాలకు పాల్పడుతున్న మండలంలోని రాజవరం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కప్పల సైదులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు సోమవారం ప్రవాణిలో ఫిర్యాదు చేశారు. రెండేళ్లుగా ఉపాధిహామీ పనులను గ్రామానికి దూరంగా నిర్వహిస్తూ అక్కడికి తన సొంత వాహనమైన ట్రాక్టర్ ద్వారా కూలీలను తరలిస్తూ డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీలో చేసిన పనులకు గాను అధిక డబ్బులు అకౌంట్లోకి వేయిస్తానని చెప్పి ఉపాధిహామీ కూలీల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జగదీశ్, చాంద్‌పాషా, సైదయ్య ఉన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మిర్యాలగూడ : ఎమ్మార్పీస్ 31వ ఆవిర్భావ వేడుకలను, ఎమ్మార్పీఎస్ అదినేత మందకృష్ణమాదిగ 60వ జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు సందాల శంభయ్యమాదిగ, కలకొండ హరీష్‌మాదిగలు దండోరా జెండాను ఎగురవేసి కేక్‌ను కట్ చేసి పంపిణి చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సందాల మధు, కొమ్ము దాసు, కోట గామయ్య, కుక్కల గోపి, గురవయ్య, లక్ష్మణ్, నాగరాజు, పరంగి వెంకటేష్, నాగమహేష్, చింటు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకోని నందికొండలో సోమవారం స్థానిక నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఇదే రోజు మందకృష్ణ మాదిగ జన్మదినం కావడంతో ఆయన పుట్టిన రోజు సందర్భంగా స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అందుగుల రవి,మందరఘువీర్, లింగాల పెద్దులు, రమణ, లక్ష్మయ్య, బద్రి, పుల్లారావు, సంపత్, చంద్రమౌళి పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: స్థానిక గాంధీనగర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేసి 31ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ సంఘం జెండాను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం జాతీయ నేత దైద సత్యం మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అహ్మద్‌ఖాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఆఎఫ్, విహెచ్‌పీఎస్ నాయకులు బకరం శ్రీనివాస్, పల్లెపాక వెంకన్న, సందాల శంభయ్య, మధు, ప్రభు, కిరణ్‌కుమార్, సురేష్, రవి, మురళి, నాగయ్య, వీరప్రతాప్, నాగరాజు, సైదులు, మధన్‌నాయక్, పెద్ద ఎల్లయ్య, వెంకటేష్, గురువయ్య, గిరి, డేవిడ్, శ్రీనివాస్, సంజయ్, నరేష్, మనోహర్ తదితరులున్నారు.

హాలియా : మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని నాయుడుపాలెంలో మందా కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందా సైదులురావు గౌతమ్ గ్రామంలోని విద్యార్థులకు ఉచితంగా నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి యడవెల్లి సోమశంకర్, జాతీయ కబడ్డీ మాజీ క్రీడాకారుడు యడవెల్లి రాంబాబు, సైదులు, కొండా సతీష్, వడ్త్యా లక్ష్మా తదితరులు ఉన్నారు.



మిర్యాలగూడ టౌన్ : గాంధీనగర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



నాగార్జునసాగర్ : నందికొండలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లిలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ జెండాను ఏగరవేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగి క్రాంతి కుమార్, ఇరిగి వెంకన్న, కొండా రమేష్, కుమ్మరి కోటేష్, కందుకూరి వెంకన్న, ఎస్‌కే ఖలీల్, దైద సైదులు, దేవెజు సురేష్, ఇరిగి కార్తిక్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామంలో ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు ఎదుల్ల ఎల్లయ్య, ఎమ్మార్పీస్ సీనియర్ నాయకులు పందిరుద్రమ శ్రీను ఆధ్వర్యంలో ఆ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే పద్మశ్రీ మందక్రిష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి జాతీయగీతాన్ని ఆలపించారు. అనంతరం కేక్ కట్ చేసి పండ్లు పంచిపెట్టారు. మండలంలోని చిన్నఅడిశర్లపల్లి,కొల్‌ముంతల్‌పహాడ్, దోన్యాల,చెన్నారం,గుమ్మడవల్లి గ్రామాలలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు వస్కుల శ్రీను,పంది అంజయ్య, పంది రామస్వామి, లక్ష్మయ్య, అనిల్,బచ్చయ్య,దుర్గమ్మ,మీనమ్మ పాల్గొన్నారు.

డిండి : ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు జంతుక రేణయ్య స్థానిక రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఆ పార్టీ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో శ్రీనువాసులు, రామకృష్ణ, సాలయ్య, అనిల్, చిరంజీవి, వంశీ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : అమరుల త్యాగాల ఫలితమే వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతెం సహదేవుడు అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు వెంకటయ్య, కొండ్రపల్లి రమేష్, యాదగిరి, నవీన్, వంశీ, నాగరాజు, శివ, ప్రకాష్, తదితరులున్నారు.

చింతపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, కృష్ణయ్య, జగన్, చెన్నయ్య, కాశయ్య పాల్గొన్నారు.

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా మహిళా సంక్షేమాధికారి కృష్ణవేణి

నిడమనూరు : బాలికలు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా మహిళా సంక్షేమాధికారి, ప్రత్యేకాధికారి కృష్ణవేణి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని, భవిత కేంద్రాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి కృష్ణవేణి బాలికలతో మాట్లాడుతూ ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. కిచెన్, వంటశాలను పరిశీలించారు. అన్నం ముద్దగా ఉండటాన్ని గుర్తించి, సిబ్బందిని ప్రశ్నించారు. ప్రభుత్వ సరఫరా చేసిన బియ్యమేనని వివరించారు. సాయంత్రం కూరలు, సాంబరు పరిశీలించి సక్రమంగా లేకపోవడంతో స్పెషల్ ఆఫీసర్‌ను ప్రశ్నించగా కూరగాయల సరఫరా ఏజెన్సీ సక్రమంగా అందించడం లేదని, కిచన్ రూం వర్షానికి కురుస్తోందని దీంతో పూర్తిస్థాయిలో కూరగాయలు రావడం లేదని వివరించారు. బాలకలకు వారంలో మెనూ ఎలా ఉంటుంది, గుడ్లు, చికెన్ ఎప్పుడు వడ్డిస్తారని ప్రత్యేకాధికారి విద్యార్థులను ప్రశ్నించారు. వారంలో నాలుగు సార్లు గుడ్లు, ఒక్కసారి చికెన్ అందించాలని సూచించారు. బాలకల హాజరును పరిశీలించారు. కస్తూరి విద్యాలయంలో 242 మంది బాలికలకు సోమవారం 162 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎస్‌ఓ పద్మారాణి వివరించారు. అలాగే భవిత కేంద్రాన్ని పరిశీలించి చిన్నారుల విద్య గురించి మ్యాట్‌లు, ఆట వస్తువులు, ఎలా ఉండాలో పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం , టాయిలెట్ల నిర్మాణంపై అంచానాలు రూపొందించి, పనులు చేపట్టాలని ఎంఈవో కు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్ వెంకన్న, ఎంపీడీఓ వెంకటేశం, ఎంపీఓ కేథార్‌నాథ్, పంచాయతీ కార్యదర్శులు మధు, నర్సింహాచారి ఉన్నారు.



నిడమనూరు కేజీబీవీలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కృష్ణవేణి

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

త్రిపురారం : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ పూర్తిగా విఫలమైందని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ అనుము శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సయావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు ,తండాల్లోని ప్రజలు తిరిగి మాజీ సీఎం కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 18నెలలు గడుస్తున్నా గ్రామాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందడంలేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో ప్రజల పక్షాన పోరాడాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం దుగ్గెపల్లిలోని కారాటె మాస్టర్ కందుల రమేష్, మాటూర్‌లో సాంస్కృతిక కళాకారుడు కలకోండ శ్రీనులు ఇటీవల మరణించడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనుముల శ్రీనివాస్ రెడ్డి, కామర్ల జానయ్య, పావన గుండ్ల వెంకటాచారి, శ్యాం సుందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, దైద రవి తదతరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి



తాళ్లవీరప్పగూడెంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ పరిధిలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి భూములు ఇచ్చిన తాళ్లవీరప్పగూడెం గ్రామ రైతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్లాంట్‌లో ఉద్యోగ, ఉపాధి కల్పించాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. సోమవారం ఆయన తాళ్లవీరప్పగూడెం గ్రామ రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాంట్ నిర్మాణ సమయంలో ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పనకు, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎలాంటి ఆటంకాలు లేకుండా భూసేకరణ చేపట్టి రైతులను ఒప్పించి సాగు భూములు ప్రభుత్వానికి ఇప్పించడం జరిగిందన్నారు. ఈ ప్రాంత రైతులకు రావాల్సిన ప్రయోజనాలకోసం సీఎం రేవంత్‌రెడ్డిని, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కలిసి విన్నవిస్తామని, రైతు కుటుంబాలకు ప్లాంట్‌లో ఉద్యోగ, ఉపాధి కల్పించేంతవరకు విడిచిపెట్టమన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎండి.యూసుఫ్, ఆంగోతు హాతీరాంనాయక్, కటికం సైదులురెడ్డి, సోము సైదిరెడ్డి, దారగాని వెంకటేశ్వర్లు, కొనకంటి సత్యనారాయణ, నర్సయ్య, సైద్య, గోవింద్, నాగిరెడ్డి, ప్రకాశ్‌నాయక్, పర్షియానాయక్, నేనావత్ బాలునాయక్, కోట్యానాయక్, అనిల్‌నాయక్, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఓటరు నమోదులో నిబంధనలు పాటించాలి



పెద్దవూర : శిక్షణ పొందిన బీఎల్‌ఓలతో అధికారులు

పెద్దవూర : నిబంధనలు అనుసరించి ఓటర్ నమోదు చేయాలని నాగార్జునసాగర్ ఏఈఆర్‌ఓ జంగాల కృష్ణయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బూత్‌లెవల్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అవసరాన్ని బట్టి ఓటర్ ఇంటికి సైతం వెళ్లాలని సూచించారు. ఓటర్ జాబితా సవరణపై క్షేత్రస్థాయి పరిశీలన జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, హబీబ్, మాస్టర్ ట్రైనర్ మేదరి దేవేందర్, పాపిరెడ్డి, బాలాజీనాయక్, మధు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చింతపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో సోమవారం బూతు స్థాయి అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమాకాంత్ శర్మ మాట్లాడుతూ జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఒకరోజు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు గ్రామస్థాయిలో నిర్వహించాల్సిన బాధ్యతలపై వారికి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని అన్ని బూతులకు సంబంధించిన అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలని ధర్నా

మిర్యాలగూడ : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయిబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఉన్నత స్థాయిలో ఉండడం ద్వారానే ఈ సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. గత ఆరేళ్ల నుంచి రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్‌సమెంట్, స్కాలర్‌షిప్స్, రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ప్రజాపాలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మాయమాటలతో కాలం గడుపుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేసి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. లేనట్లయితే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదా, డివిజన్ అధ్యక్షుడు జగన్‌నాయక్, నాయకులు న్యూమాన్, ప్రసన్న, సంపత్, అనిల్, అఖిల్, కోటేష్, సాయి, మణి, బన్ని, తరుణ్, కిరణ్, వెంకటేష్, రఘు పాల్గొన్నారు.



మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



బొలార్డ్స్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ రామ్మూర్తి

చింతపల్లి : హైదరాబాద్ నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని నసర్లపల్లి, వింజమూరు, వెంకటంపేట, కురుమేడు, పోలేపల్లి రాంనగర్, మాల్ వెంకటేశ్వర నగర్, విరాట్ నగర్ కాలనీ ప్రధాన కూడలి వద్ద మూలమలుపుల వద్ద సూచిక బోర్డులను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని మూలమలపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాదారులు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలన్నారు. దస్త్రాలతో పాటు తప్పనిసరిగా సీట్ బెల్టు, హెల్మెట్ ధరించాలని సూచించారు. రాష్ట్ర రహదారిపై మాల్ వెంకటేశ్వర్ నగర్, చింతపల్లి మండల కేంద్రంలో ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు.